క్లుప్తంగా...

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలో వివిధ సమస్యలపై ప్రజలు 32 ఫిర్యాదులు అందించినట్లు జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తులను నిబంధనల మేరకు పరిష్కరించాలని, ఏ ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో పెట్టకూడదన్నారు. కార్యక్రమంలోడీఆర్ఓ లింగ్యానాయక్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ బాలాజీ శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి రంగనాథ స్వామి, అలివేలు మంగ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వైద్యులు

మేడ్చల్: పట్టణంలో అవని బిల్డర్స్, రెడ్ క్రాస్ సంస్థ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక కేఎల్ఆర్ విజయానగర్ క్లబ్ హౌస్ వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరానికి యువకులు స్వచ్ఛందంగా హాజరై రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి నిర్వహకులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అవని బిల్డర్స్ ప్రతినిధులు నాగేశ్వర్‌రావు, వెంకటేశ్వర్లు, రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తవ్వి వదిలేశారు



ఇందిరానగర్‌లో తవ్వి వదిలేసిన రోడ్డు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీ పరిధిలోని ఆరో వార్డు ఇందిరా నగర్‌లో రోడ్డు మధ్యలో తాగు నీటి సరఫరా కోసం తవ్విన గుంతల్లో పైపులు వేసిన అధికారులు చదును చేయడం మరిచిపోయారు. పనులు పూర్తయి 15 రోజులు గడుస్తున్నా చదును చేయకపోవడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఈ కారణంగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపించారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతలు పూడ్చి వేయించాలని కోరారు.

భారీ వర్షంతో అవస్థలు



నీటిని కిందకు తరలించేందుకు జేసీబీతో తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

మేడ్చల్: మేడ్చల్ పట్టణంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎడతెరపి లేని వర్షాల కారణంగా పలు కాలనీలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునగడంతో మున్సిపల్ అధికారులు, వార్డుల కౌన్సిలర్లు యంత్రాల సహాయంతో బయటికి తోడారు. పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు అపార నష్టం వాటిల్లింది.



మేడ్చల్ లో కార్మికుల ర్యాలీ



కార్మికులతో కలిసి భోజనం చేస్తున్న చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి

వాడవాడలా మేడే సంబరాలు

ర్యాలీలు..సహపంక్తి భోజనాలు



ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థుల ర్యాలీ

మేడ్చల్: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మేడ్చల్ పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కంపెనీలు, ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల వద్ద యూనియన్ల జెండాలను ఆవిష్కరించారు. బీఆర్‌టీయూ, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ, సీఐటీయు, ఏఐటీయూసి తదితర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, పలు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్మికులను ఘనంగా సన్మానించిన నేతలు వారితో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో పలు పార్టీల నేతలు హరివర్ధన్‌రెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహారెడ్డి కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌లో..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు డివిజన్లలో సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, సీపీఎం, బీఆర్ఎస్, బీఆర్ఎస్‌కేవీ నాయకులు కార్మిక జెండాలను ఎగురవేశారు.

ఘట్‌కేసర్‌లో..

భవన నిర్మాణ, పారిశుద్ధ్య కార్మికులు సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఘట్‌కేసర్, అవుషాపూర్, చౌదరిగూడలో జరిగిన వేడుకల్లో చైర్ పర్సన్ పావనీ యాదవ్, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండల్‌రెడ్డి, సర్పంచులు కావేరి, రమాదేవి జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐలయ్య యాదవ్, మశ్చేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు, పంచాయతీ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

శామీర్‌పేట్ మండలంలో..

ఉమ్మడి శామీర్‌పేట మండలంతో పాటు తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో జెండాలను ఆవిష్కరించారు. ఉద్దమర్రి గ్రామ భవన నిర్మాణ కార్మికసంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు, కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, భిక్షపతి, కిష్టయ్య, పోచయ్య, చంద్రయ్య, బల్‌రాం తదితరులు పాల్గొన్నారు.

కీసర డివిజన్‌లో

కీసర మండలం, నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో ఎంపీపీ ఇందిర, నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీత, గోధుమకుంటలో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఆటో, భవన నిర్మాణ రంగ కార్మికులు జెండాలను ఆవిష్కరించారు.



గోధుమకుంటలో..



ఘట్‌కేసర్‌లో..



అవుషాపూర్‌లో ..



గౌడవెల్లిలో..



జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ..



ఉద్దమర్రిలో..

బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ.164.20 కోట్లు

- 2022-23లో రూ.152 కోట్లకుగాను, రూ.156 కోట్లు పంపిణీ
- కార్యాచరణ ఖరారు చేసిన డీఆర్‌డీఏ

సాక్షి,మేడ్చల్ జిల్లా: పొదుపు సంఘాల మహిళల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఏటా రుణాలు అందజేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణ లక్ష్యాలను నిర్దేశించి, బ్యాంకు అధికారుల సమన్వయంతో పంపిణీ చేస్తోంది. ఇందులో భాగంగానే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం రూ. 164.20 కోట్లుగా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ఖరారు చేసింది. రానున్న మార్చి 31 నాటికి 2,703 స్వయం సహాయక మహిళా సంఘాలకు నిర్దేశించిన ఈ లక్ష్యాన్ని చేరుకునేలా కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఏపీఎం, సీసీలకు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉండగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో క్షేత్రస్థాయి పరిస్థితులను మించి రుణ లక్ష్యం పంపిణీలో ముందంజలో ఉంది. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,852 మహిళా సంఘాలకు రూ. 152.92 కోట్ల రుణ లక్ష్యంగా నిర్దేశించినప్పటికీ, 2,992 మహిళా సంఘాలకు రూ.156.98 కోట్లు పంపిణీ చేసి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ముందంజలో నిలిచింది.

ఈ ఏడాదైనా లక్ష్యం సాధించేనా?

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలో 3,571 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 36,128 మంది సభ్యులుగా ఉన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి కింద రూ.17.27 కోట్ల రుణ లక్ష్యం నిర్దేశించగా, రూ.14.27 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి రుణ లక్ష్యం 82.63 శాతాన్ని సాధించిన జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో వంద శాతం రుణ లక్ష్యాన్ని చేరుకునేలా కార్యాచరణ రూపొందించేందుకు కసరత్తు చేస్తోంది.

గౌడవెల్లి చౌరస్తా అభివృద్ధికి కృషి



చౌరస్తాను పరిశీలిస్తున్న సర్పంచ్ తదితరులు

మేడ్చల్: మండల పరిధిలోని గౌడవెల్లి ఛత్రపతి చౌరస్తా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ తెలిపారు. సోమవారం ఆయన గ్రామ నాయకులతో కలిసి చౌరస్తాను పరిశీలించారు. చౌరస్తాను విస్తరించి మౌలిక సదుపాయాలు కల్పించి అందంగా తీర్చిదిద్దుతామన్నారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నలువైపులా రోడ్డు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పెంటమ్మ, వార్డు సభ్యులు సదానంద్‌గౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీ అభివృద్ధిపై కరపత్రం

కీసర: నాగారం మున్సిపాలిటీలో మూడేళ్లలో రూ. 66 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులపై ముద్రించిన కరపత్రాన్ని చైర్మన్ చంద్రారెడ్డి సోమవారం మున్సిపల్ శాఖ డైరెక్టర్ సత్యనారాయణకు ఆయన కార్యాలయంలో అందజేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించి సహకరించాలని డైరెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



మున్సిపల్ డైరెక్టర్ సత్యనారాయణకు కరపత్రాన్ని అందజేస్తున్న చంద్రారెడ్డి

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి



ఆందోళన చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఎదులాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నేతలు సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారం రోజులు గడుస్తున్న కొనుగోళ్లు ప్రారంభించకపోవడం దారుణమన్నారు. అకాల వర్షాలతో అన్నదాతలు ఆగమవుతున్నా బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోకుండా ఆత్మీయ సమ్మేళనాలు, దావత్‌లలో మునిగితేలుతున్నారని ఆరోపించారు. రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సర్కారు కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో ప్రైవేటు వ్యక్తులకు రూ. 1600కు క్వింటాల్ ధాన్యం అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. కొనుగోళ్లు ప్రారంభించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, గ్రామశాఖ అధ్యక్షుడు కుమారస్వామి, ఉప సర్పంచ్ నరేశ్, వార్డు సభ్యులు సురేశ్, రామోజీ, నరేందర్‌రెడ్డి, అన్నదాతలువ పాల్గొన్నారు.

మహిళల గౌరవానికి భంగం కలిగించొద్దు



సాక్షి,మేడ్చల్ జిల్లా: మహిళలను గౌరవించడం మన సంప్రదాయమని, వారి స్వేచ్ఛకు ఏ మాత్రం భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ మర్యాదగా ప్రవర్తించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్)అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పని ప్రాంతాల్లో మహిళలపై లైంగిక వేధింపులు నివారణ, నిషేధం, పరిష్కార చట్టంపై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మహిళలు పని చేసే ప్రదేశంలో వారి స్వేచ్ఛ, మర్యాదలకు ఏమాత్రం భంగం వాటిల్లకుండా వారి హక్కులను పరిరక్షించడానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీలను తప్పకుండా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి (డీడబ్ల్యూఓ) అక్కేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ గ్రామ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి



సాక్షి,మేడ్చల్ జిల్లా: ముఖ్యమంత్రి కేసీఆర్ జూనియర్ గ్రామ కార్యదర్శులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర స్థానిక సంస్థల అధ్యక్షుడు, ఘట్కేసర్ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టిన మేడ్చల్ జిల్లా జూనియర్ గ్రామ కార్యదర్శులకు ఆయన మద్ధతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ గ్రామ కార్యదర్శులు గత నెల 28 నుంచి డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్నారన్నారు. ,అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు రోడ్ల పాలు చేయటం దారుణమన్నారు. వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో 50 మందికి గ్రామ కార్యదర్శులు చనిపోయారని, వారికి ఎలాంటి భద్రత లేకపోవడం దారుణమని, చివరికి వారి అంత్యక్రియలను కూడా చందాలు వేసుకుని చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. జూనియర్ గ్రామ కార్యదర్శుల పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థలకు చెందిన బీజేపీ ప్రజాప్రతినిధులు , సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు నుంచి వెలువడుతున్న లీచెట్ (రసాయన వ్యర్థాలు)ను సమీపంలోని కార్మికనగర్ కాలనీలోకి వదులుతున్న డంపింగ్‌యార్డు నిర్వాహకులు, రాంకీ సంస్థపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జవహర్‌నగర్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, బోడుప్పల్ కార్పొరేటర్ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం డంపింగ్ యార్డు వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాంకీకి వ్యతిరేకంగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షపు నీటి ముసుగులో మురుగు వ్యర్థాలను నిల్వచేసిన నీటిని కాలనీలోకి పంపిస్తున్నారని ఆరోపించారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. డంపింగ్ యార్డు కారణంగా పలు కాలనీల వాసులు ఇప్పటికే శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాంకీ సంస్థకు కొమ్ము కాస్తుందన్నారు. సమస్యపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అక్కడినుంచి తరలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వినయ్‌కుమార్, గండి సునీత, చింత విజయ, జయమ్మ, సుమన్, స్థానికులు శ్రీనివాస్, బాలరాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాల నియంత్రణకు కృషి చేయాలి

సాక్షి,మేడ్చల్‌జిల్లా: దేశభవిష్యత్ యువతరంపైనే ఆధారపడి ఉందని వారు సక్రమ మార్గంలో పయనించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిషా ముక్త్ భారత్ అభియాన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజాన్ని అల్కాహాల్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు పట్టి పీడిస్తున్నాయని వాటికి యువత దూరంగా ఉండాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి అక్కేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డ్రగ్ ఫ్రీ కంట్రీగా రూపొందించేందుకు కృషి చేస్తామని జిల్లా అధికారులు ప్రతిజ్ఞ చేశారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

మల్కాజిగిరి: నాలాల్లో పడి చిన్నారులు మృతి చెందుతున్న సంఘటనల్లో బాధ్యులైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ గ్రేటర్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ జోన్ పరిధిలో పలు సంఘటనలు చోటు చేసుకుంటున్నా కిందిస్థాయి సిబ్బంది పై చర్యలు తీసుకుంటున్నారే తప్ప సికింద్రాబాద్ జోనల్ కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులపై చర్యలు తీసుకోవం లేదన్నారు.

కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి



మాట్లాడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ

ఉప్పల్: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. సోమవారం రాత్రి ఉప్పల్ మేకల భారతి గార్డెన్‌లో మాజీ మేయర్ బొంతు రాంమోహన్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోంమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారన్నారు. గతంలో 12 గురుకుల పాఠశాలలు ఉండేవని ప్రస్తుతం 204 రెసిడెన్సియల్ మైనార్టీ గురుకులాలు ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. దేశంలో సెక్యులరిజం అమలు కావాలంటే కేసీఆర్ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ డిప్యూటీ మేమర్ బాబా ఫసియుద్దీన్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, బన్నాల ప్రవీణ్, మేకల హనుమంత్‌రెడ్డి, మధు సూదన్ రెడ్డి, దర్గ దయాకర్‌రెడ్డి, గొల్లూరి అంజయ్య, బద్రుద్దీన్, మసీద్ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చందనోత్సవం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీ వేంకటేశ్వర దేవస్థానంలో సోమవారం చందనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు ప్రధాన అర్చకుడు ముడుంబై వెంకటరమణాచార్యులు, అర్చకులు తులసి రమణాచార్యులు విశేష ఫల రస సహిత పంచామృతాభిషేకము, శత ఘటాభిషేము అనంతరం చందనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ ఉమేష్‌సింగ్, ఈవో రవీందర్‌రెడ్డి, క్లర్క్ సుధాకర్ , భక్తులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నర్తన కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పల్ల శ్రీవల్లి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. పూర్వరంగా విధి, పుష్పాంజలి, గణేష్, పంచరత్న, బ్రహ్మాంజలి, బాలగోపాల తారంగం, తిల్లాన తదితర అంశాలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పద్మజ రెడ్డి కళాకారులను సత్కరించారు.

డీసిల్టింగ్‌లో అలసత్వం వద్దు

మల్కాజిగిరి: నాలాల డీసిల్టింగ్ పనుల్లో అలసత్వం వహించరాదని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం డివిజన్ పరిధిలోని సత్య రాఘవేంద్రకాలనీ, సత్తిరెడ్డి కాలనీలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. నాలాల్లో ఎప్పటికప్పుడు డీసిల్టింగ్ చేయాలని ఎక్కడైనా పైపులైన్లు దెబ్బతింటే వెంటనే మార్చాలని సూచించామన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్, మేనేజర్ వేణుగోపాల్‌నాయుడు, వీఐ రజనీకాంత్, బాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.